
తొలి అడుగులో విజయం



ద్వాక్రా మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో ఆదరణ



ముచ్చటగొలిపే మట్టి, పింగాణి బొమ్మలు

ఇళ్లలో చిన్నచిన్న వస్తువులు తయారు చేసి ఉన్న ఊరిలో, జిల్లాస్థాయిలో విక్రయించుకున్న మహిళలు ఆన్‌లైన్ వాణిజ్యంలో అడుగుపెట్టారు. నాణ్యత, నవ్యత కలగలసిన ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేశారు. తొలి అడుగులోనే అందరి మెప్పు పొందుతున్నారు.

ఈనాడు, అనకాపల్లి
–నర్సీపట్నం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) ల్లో వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్న వనితల ఆదాయాన్ని పెంచేందుకు ప్రతిపాదించింది. వీరు తయారు చేసిన వస్తువులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సమీక్షలో ఈ ఉత్పత్తులను ఈ-కామర్స్‌లో విక్రయించుకునేలా చూడాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులను ఆదేశించారు. ఫలితంగా ఇప్పుడు వీటికి గ్లోబల్ మార్కెట్‌లోకి ప్రవేశానికి అవకాశం దక్కింది. కేంద్రం ఆధ్వర్యంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదికగా ఆన్‌లైన్ అమ్మకాలకు వీలుగా నర్సీపట్నం, ఎలమంచిలిలోని 55 వస్తువులను యాప్‌లో పొందుపరిచారు.

మరో అరవై సరకులను రిజిస్టర్ చేశారు. వీటి వాణిజ్యాన్ని మరింత విస్తృతం చేయడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు.



▶▶ **సృజనకు గుర్తింపు దక్కింది:** ఏదైనా కొత్తగా ఉండాలనే ఉద్దేశంతో ఎంబ్రాయిడరీ దారంతో ఏడాదిగా గాజులు తయారు చేస్తున్నాను. కుందన్స్ సైతం అతికించడంతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఆన్‌లైన్‌లోనూ ఇవి పలువురిని ఆకట్టుకుంటున్నాయి. దూరప్రాంతాల నుంచి ఆర్డర్స్ వస్తున్నాయి. ఇంత గుర్తింపు వస్తుందని ఊహించలేదు. ఇన్నాళ్లు జిల్లాలోని వాళ్లకే తెలిసిన ఇవి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం ఆనందంగా ఉంది. వీటికి ఇంకా గిరాకీ అధికమై ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నాను. ఎస్‌హెచ్‌జీ సభ్యుల మధ్య ప్రత్యేక లింక్ ద్వారా వీటి కొనుగోలుకు అవకాశం కల్పించారు.

– ఎ.ముకుందప్రియ, నర్సీపట్నం



▶▶ **ఇదంతా నమ్మలేక పోతున్నాం:** ఆన్‌లైన్లో బుక్ చేస్తే ఇంటికే కావల్సిన వస్తువులు వస్తాయని అందరూ చెబుతుంటే ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు మేము తయారు చేసిన ఉత్పత్తులకు ఆర్డర్లు వచ్చి ఎక్కడెక్కడో ఉన్న వారు పొందగలుగుతున్నారంటే నమ్మలేక పోతున్నాం. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. నేను అయిదేళ్లగా ఇంటి వద్దనే మట్టి, పింగాణి బొమ్మలు తయారు చేసి అమ్ముతున్నాను. ఇటీవలే వీటిని మెప్మా అధికారులు ఫొటోలు తీసుకున్నారు. నా బొమ్మలకు ఇప్పటికే ఎనిమిది ఆర్డర్లు వచ్చాయి.

– పక్కి లక్ష్మి, బలిఘట్టం



డిజిటల్ వాణిజ్యంపై పొదుపు సంఘాల మహిళలకు ఇటీవల నిర్వహించిన అవగాహన సమావేశం

ఏడాదిలో వంద ఉత్పత్తులు లక్ష్యం

అందరి సహకారంతో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఉత్పత్తుల డిజిటల్ మార్కెటింగ్‌ను విజయవంతంగా పట్టాలెక్కించగలిగాం. అనుమతి లభించిన వస్తువులను కొనుగోలుదారులకు పంపించడానికి సిద్ధంగా ఉంచుతున్నాం. ఇప్పటికే నర్సీపట్నం, ఎలమంచిలికి చెందిన ఫ్యాన్సీ సామగ్రి, మట్టి, పింగాణీ బొమ్మలు, దారం గాజులు, వస్త్ర సంచులు, బ్లౌజులు, చీరలు, నాణ్యమైన గిల్ట్ నగలు తదితర 55 సరకులకు ఆమోదం లభించింది. వీటికి ఆర్డర్స్ వస్తున్నాయి. ఏడాదిలో వంద వరకు ఉత్పత్తులను ఆన్‌లైన్ విక్రయాలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. డిజిటల్ అమ్మకాలతో నాలుగైదు రోజుల్లోనే నగదు జమ కావడం, కమిషన్ తగ్గడం వంటి ప్రయోజనాలతో మహిళలకు ఆదాయం పెరగనుంది. ఓఎన్‌డీసీ యాప్ నుంచి వీటిని ఎవరైనా బుక్ చేసుకోవచ్చు. – సరోజిని, మెప్మా పీడీ, అనకాపల్లి





ఎంబ్రాయిడరీ దారంతో తయారుచేసిన గాజులు

రూ.8.31 కోట్లతో అభివృద్ధి పనులు | ఎంపీ సీఎం రమేశ్

రావికమతం, న్యూస్‌టుడే: చోడవరం నియోజకవర్గం రావికమతం మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి రూ.8.31 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఎంపీ సీఎం రమేశ్ చెప్పారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ తాతయ్యబాబుతో కలిసి చీమలపాడు, జెడ్.కొత్తపట్నంలో పర్యటించారు. చీమలపాడు పంచాయతీ అజేయపురం, రాయపాడు తదితర గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. సీఎం రమేశ్ మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాల్లో సదుపాయాలు కల్పిస్తామన్నారు. అంతకుముందు గిరిజన మహిళలు ప్రజాప్రతినిధులకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. తెదేపా మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, జెడ్.కొత్తపట్నం సర్పంచి సురేష్, గంపవానిపాలెం ఎంపీటీసీ సభ్యుడు రాజిబాబు, నాయకులు బంటు శ్రీనివాసరావు, చినబ్బాయి, బొండా రాములు, గాలి రమణబాబు, తాతాజీ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు తదితరులు

భూ సమస్యలపై గ్రామసభల్లో అర్జీల స్వీకరణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో బుధవారం నుంచి పక్కాగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే పూర్తయిన 455 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 30 రోజుల్లో గ్రామసభలు పూర్తయ్యే విధంగా షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. అన్ని రకాల భూసమస్యలపై అర్జీలు స్వీకరించాలన్నారు. రీ సర్వేతో నష్టపోయిన రైతులు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు మొదటి పనిగా అర్జీల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి భూములు ఖాళీ చేయించాలని ఆదేశించారు. డీఆర్వో బి.దయానిధి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి, డీఎం జయంతి, సర్వేశాఖ సహాయ సంచాలకులు గోపాలకృష్ణ, ఇతర అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయకృష్ణన్

సభాపతితో బత్తుల భేటీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు మంగళవారం శాసనసభాపతి అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అయ్యన్న మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా లక్ష్యాలను చేరుకునేలా యంత్రాగాన్ని సన్నద్ధం చేయాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. తాతయ్యబాబు వెంట తెదేపా నాయకులు ఉన్నారు.



అయ్యన్నను సత్కరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్యబాబు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రవీంద్ర

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం జిల్లాలో చేపట్టనున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇన్‌ఛార్జ్ మంత్రి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. తెదేపా బీసీ సాధికార సమితి ఛైర్మన్‌గా రవీంద్ర గతంలో అనకాపల్లికి పలుమార్లు వచ్చి సమావేశాలు నిర్వహించారు. తమతో సత్సంబంధాలు ఉన్న ఈయన్ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించడంపై మంగళవారం స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం ఆదేశాలు.. దివ్యాంగుడికి చేయూత

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సీఎం ఆదేశాలతో అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మురకొండ రత్తయ్యకు ఊరట లభించింది. జులై 11న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్.రాయవరం పర్యటనకు వచ్చినప్పుడు రత్తయ్య కలిశాడు. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, సాయం అందజేయాలని కోరాడు. అప్పుడు సీఎం ఇచ్చిన హామీ మేరకు.. జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధులు రూ.1.20 లక్షలతో హోండా యాక్టివా వాహనాన్ని కొనుగోలు చేసి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీపీవో రామారావు, లారస్ కంపెనీ హెచ్ఆర్ డి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయకృష్ణన్ అందించిన మోటార్‌సైకిల్‌పై రత్తయ్య

రంగాలవారీగా.. దూసుకుపోయేలా..

నవ్యాంధ్రను స్వర్ణాంధ్రగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. గత అయిదేళ్ల వైకాపా అరాచక పాలనతో పడకేసిన రంగాలన్నింటినీ గాడిలో పెట్టేందుకు నడుంబిగించింది. జిల్లాల సమగ్రాభివృద్ధికి స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలకు వికసిత్ భారత్‌గా ఎదిగేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది.

ఈనాడు, అనకాపల్లి

★ వచ్చే అయిదేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికల తయారీ

★ మౌలిక, పారిశ్రామిక, సేవా రంగాలకు అధిక ప్రాధాన్యం



అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో మన రాష్ట్రం కీలక భాగస్వామిగా ఉండేలా స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రాన్ని తయారు చేస్తోంది. దీనికోసం ముందుగా 2024-29 మధ్యలో గ్రామం, మండల, జిల్లా స్థాయిలో రంగాల వారీగా అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలు, లక్ష్యాల రూపకల్పన దిశగా పాలకులు దృష్టిసారించారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా అనకాపల్లి జిల్లా కీలక గమ్యస్థానంగా మారుతోంది. సేవల రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లాను ఉన్నతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

అనకాపల్లి, అల్లూరి జిల్లాలు వ్యవసాయ ఆధారిత జిల్లాలు. ఇక్కడ నీటి వనరులను అభివృద్ధి చేసి, యాజమాన్య పద్ధతుల్లో మార్పులు తీసుకురావాల్సి ఉంది. అలా చేయగలిగితే వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

★ అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం ధాన్యం ఉత్పత్తి 2.43 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. వచ్చే అయిదేళ్లలో దీన్ని 3.15 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.

★ చిరుధాన్యాలు 2,451 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 2029 నాటికి దీని విస్తీర్ణం 5,290 హెక్టార్లకు పెంచాలని నిర్ణయించారు.

★ అనకాపల్లి, అల్లూరి జిల్లాలో ప్రస్తుతం 15 వేల హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. రానున్న అయిదేళ్లలో దీన్ని రెట్టింపు విస్తీర్ణానికి తీసుకురానున్నారు.

★ రెండు జిల్లాల్లో బిందు, తుంపర సేద్యం ప్రస్తుతం 5,200 హెక్టార్లలో అమలు చేస్తున్నారు. 2029 నాటికి ఈ విస్తీర్ణం 12 వేల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పారిశ్రామికం.. ప్రగతి మంత్రం..



జిల్లాల పునర్విభజన తర్వాత పారిశ్రామికంగా రాష్ట్రంలో అనకాపల్లి కీలక ప్రాంతంగా మారింది. ప్రస్తుతం జిల్లా స్థూల ఆదాయ ఉత్పత్తిలో 52 శాతం పరిశ్రమల వాటానే ఉంది. వచ్చే అయిదేళ్లలో 75 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

★ విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో నక్కపల్లి, రాంబిల్లి నోడ్స్ అభివృద్ధి చెందుతున్నాయి. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు కాబోతోంది. అచ్యుతాపురంలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పార్క్ రాబోతోంది. చిన్న పరిశ్రమలకు వీలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. వీటి ద్వారా రూ.1.79 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోతున్నాయని, 1.05 లక్షల మందికి ఉపాధి దక్కనుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

★ రొయ్యల సాగు, పాల దిగుబడిని పెంచి స్థూల ఆదాయవృద్ధిలో వాటి శాతం పెరిగేలా లక్ష్యాలు పెట్టుకున్నారు. పాల దిగుబడి ప్రస్తుతం 7.98 లక్షల టన్నులు ఉంటే, వచ్చే అయిదేళ్లలో 11.83 లక్షలకు పెంచాలని నిర్ణయించారు.

★ రాబోయే అయిదేళ్లలో నాతవరం, మాకవరపాలెంలో ఎంఎస్ఎంఈ తరహాలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. వల్లూరు, టి.సిరసపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో 25 వేల మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశాలున్నాయని అధికారులు ప్రతిపాదిస్తున్నారు.

సేవల రంగంలో సంతృప్తి స్థాయి దాటేలా..

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా సేవల రంగంలో స్థూల ఆదాయ ఉత్పత్తి (జీవీఏ)ని గణనీయంగా పెంచడానికి అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. స్వదేశ్ దర్శన్ పేరుతో అనంతగిరి మొదలుకొని అరకులోయ మీదుగా పాడేరు, లంబసింగి వరకు ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే అడుగులు పడ్డాయి. వీటిని పూర్తిచేయగలిగితే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

అనకాపల్లిలో మాడుగుల నియోజకవర్గంలో కొత్తగా ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు సేవల రంగంలోకి వచ్చే ఇతర ప్రాజెక్టులు, పథకాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నారు.



న్యాయసేవలకు 15100 హెల్ప్‌లైన్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: న్యాయ సేవల కోసం 15100 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మండల లీగల్‌సెల్ అథారిటీ ఛైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి శ్రీ విద్య తెలిపారు. బాధితులు తమ సమస్యలపై న్యాయ సేవల కోసం దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నేషనల్ లీగల్ సర్వీస్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ ప్రజల కోసం ఉచిత హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు బాధితులు ఎవరైనా తమ సమస్యలపై న్యాయ సంబంధిత సేవల కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌కు కాల్‌చేసి సాయం పొందొచ్చని సూచించారు.

విస్తరించక.. విసుగు తప్పక!



అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)ని, 16వ నంబర్ జాతీయ రహదారిని కలిపే రోడ్డు ఇది కావడంతో రోజంతా వేలాది వాహనాలతో రద్దీగా ఉంటోంది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో మరింత ట్రాఫిక్ పెరిగిపోతోంది. ఈ రోడ్డు కేవలం 20 అడుగుల మాత్రమే ఉండడం, దశాబ్దాలుగా విస్తరణ పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా హరిపాలెం, మునగపాక, నాగులాపల్లి కూడలిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని, అప్పటివరకు కనీసం ట్రాఫిక్‌ను సరిచేయడానికి పోలీసు సిబ్బందిని విధుల్లో ఉంచాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– అచ్యుతాపురం, న్యూస్‌టుడే

‘నెట్’లో లక్ష్మీప్రహర్ష సత్తా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (నెట్)లో పేట విద్యార్థిని **కొసిరెడ్డి లక్ష్మీప్రహర్ష** జాతీయస్థాయిలో 127 ర్యాంకు సాధించింది. ఎన్‌టీఏ జులైలో సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష నిర్వహించింది. దీనిలో ఆమె ఉత్తమ ర్యాంకు కైవసం చేసుకుంది. పాయకరావుపేటకు చెందిన ప్రహర్ష కేంద్రీయ విశ్వవిద్యాలయం (హైదరాబాదు) నుంచి భౌతికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఫిడ్జీ ఇంటర్నేషనల్ (దిల్లీ)లో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. ఆమె ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ ఐఐటీ, ఎన్ఐటీ లేదా సెంట్రల్ యూనివర్సిటీలో రీసెర్చ్ చేసి డాక్టరేట్ తీసుకోవాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నదే కోరికని వివరించారు. లక్ష్మీప్రహర్ష తండ్రి డాక్టర్ కె.వీర్రాజు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు తదితరులు ఈ విద్యార్థినిని అభినందించారు.



పాడిరైతులకు కూటమి సర్కార్ అండ

కలెక్టరేట్, న్యూస్‌టుడే

అందుబాటులోకి క్రెడిట్ కార్డులు

పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడిరైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశువులకు దాణా, మేత, మందులు కొనాలంటే చేతుల్లో డబ్బులు ఉండాల్సిందే. చాలా మంది రైతులకు సకాలంలో డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రూ. 10 వేలు కావాలన్న అధిక వడ్డీలను అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు శ్రీకారం చుట్టింది.



» పాడి రైతులు తమకు సొమ్ము కావలసినప్పుడు నగదు తీసుకుని అవసరాలు తీర్చుకోవచ్చు.

» ఈ కార్డు ద్వారా గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం అందిస్తారు. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు.

» తీసుకున్న రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా చెరో 3 శాతం చొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక్క శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది.

» సక్రమంగా కార్డులను వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండా ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయొచ్చు.

క్రెడిట్ కార్డులు రైతులకు ఆర్థికంగా ఆలంబనంగా నిలుస్తాయి. వీటి ద్వారా అదనంగా పశువులు కొనుగోలు చేసుకోవచ్చు.

▶▶ **పశుసంపద వివరాలు:** జిల్లాలోని 24 మండలాల్లో 1.85 లక్షల ఆవులు, 2.5 లక్షల గేదెలు, 1.61 లక్షల గొర్రెలు, 1.85 లక్షల మేకలు ఉన్నాయి. 2.32 లక్షల మంది పెంపకందార్లు ఉన్నారు. 13,231 మందికి ఈకార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 879 మంది పాడిరైతులకు ఈ కార్డులు పంపిణీ చేశారు. అర్హులైన వారు వార్డు, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, పశువైద్య సిబ్బంది ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి: పాడిరైతులు ఈ కార్డుల అవసరాలు తీర్చుకోవచ్చు. గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం అందిస్తాం. అధిక వడ్డీల భారం తగ్గుతుంది. ఈ కార్డులు పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి.



– రామ్మోహన్‌రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

తల్లికి టాటా చెప్పిన కొద్దిసేపటికే..

రోడ్డు ప్రమాదంలో చేతివేళ్లు కోల్పోయిన చిన్నారి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అమ్మ ఇచ్చిన క్యారేజీ తీసుకుని కాన్వెంట్‌కు వెళ్లేందుకు సోదరుడితో కలిసి ఆ చిన్నారి ఆటో ఎక్కింది. వాహనం కదులుతుండగా ఇద్దరూ తల్లికి టాటా చెప్పారు. కాన్వెంట్‌కు సమీపంలో ఆటో ప్రమాదానికి గురైంది. స్టీల్ రాడ్డును పట్టుకుని కూర్చున్న బాలిక చేతి వేళ్లు తెగిపడ్డాయి. ఈ ఘటన మంగళవారం ఆర్ఎల్ పురం - చెట్టుపల్లి మార్గంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెట్టుపల్లికి చెందిన గంగిరెడ్ల బాలనాగేశ్వరరావు దంపతులకు కవల సంతానం. వీరిలో శ్రావ్యశ్రీ శర్వాణి, సోదరుడు పెదబొడ్డేపల్లిలోని ఓ కాన్వెంట్‌లో చదువుతున్నారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయాన్నే యూనిఫాం వేసుకుని తల్లికి టాటా చెప్పి ఆటో ఎక్కారు. చెట్టుపల్లి దాటాక ఎదురుగా వస్తున్న రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన బస్సు అదుపుతప్పి ఆటోను రాసుకుంటూ వెళ్లింది. ఆ సమయంలో ఆటోలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఓ పక్కన కూర్చుని స్టీల్ రాడ్డును పట్టుకున్న శర్వాణి కుడి చేయి నుజ్జయింది. ఉంగరం వేలు, మధ్య వేలు తెగిపడ్డాయి. వీటిలో ఒకటి దొరకగా, మరొకటి కనిపించలేదు. దొరికిన వేలితో వెంటనే బాలికను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటోంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారావు చెప్పారు.


తండ్రి నాగేశ్వరరావు ఒడిలో శ్రావ్యశ్రీ శర్వాణి


బాలిక ప్రమాదానికి గురైంది ఈ ఆటోలోనే..

క్లిష్ట సమస్యలకు మెడ్‌టెక్‌జోన్‌లో పరిష్కారం

ఈనాడు, విశాఖపట్నం: అత్యంత సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) క్రియాశీల వేదికగా మారిందని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సహాయ మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. విశాఖలోని ఏఎంటీజెడ్‌లో మంగళవారం మాజీ రాష్ట్రపతి దివంగత డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. నాయకత్వం, బహుముఖ స్వభావానికి కలాం నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. జోన్‌లో వివిధ యూనిట్లను పరిశీలించారు. వాటి ప్రాధాన్యత, రూపొందిస్తున్న ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ముందుచూపుతో 2018లో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేసిన సీఎం చంద్రబాబునాయుడు ప్రగతిశీల నాయకత్వాన్ని ప్రశంసించారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందేందుకు ఇదొక చక్కని కేంద్రమని, ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నా అభివృద్ధికి అపార సామర్థ్యం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాలింట్ ఫెసిలిటీ, జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ (ఎన్ఎస్‌టీఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రేడియాలాజికల్ టెక్నాలజీ తదితరాలను ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ త్రివేదితో కలిసి మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఐలో ప్రత్యేక వైద్య సంబంధిత కోర్సులు ప్రారంభించేందుకు వైద్య పరికరాల తయారీదారులు ముందున్నారు. మెడ్‌టెక్ సీఈవో డా.జితేంద్ర శర్మ మాట్లాడుతూ కలాం స్ఫూర్తితో ప్రతి ఆవిష్కర్త, ఉత్పత్తిదారుడు పనిచేస్తే వైద్య ఉపకరణాల తయారీలో భారత్ తిరుగులేని స్థానానికి చేరుకుంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన వైద్య పరికరాలను ఉచితంగా అందిస్తామని భరోసా కల్పించారు.


మెడ్‌టెక్ జోన్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, జోన్ సీఈవో జితేంద్ర శర్మ తదితరులు

పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఈ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపికచేసిన ఆయిదు గ్రామాలను పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్తు వినియోగించేలా చూడాలన్నారు. ప్రజలంతా వినియోగించుకునేలా ఈ పథకంపై విద్యుత్తు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. విద్యుత్తు సంస్థ ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 30వేల సోలార్ యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు కిలోవాట్లకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 1677 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 288 మంది మాత్రమే రూ.1300 ఫీజు చెల్లించారన్నారు. జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, నెడ్‌క్యాప్ అభివృద్ధి అధికారి సీహెచ్ పవన్, విద్యుత్తు సంస్థ డీఈలు, ఏఈలు, సోలార్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


పీఎం సూర్యఘర్ పథకం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

నూకాలమ్మను దర్శించుకున్న సినీ నటులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మను మంగళవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ఉందిలే మంచికాలం ముందు ముందునా వంటి చిత్రాల్లో హీరోగా నటించిన సుధాకర్, కంచరపాలెం, కమిటీ కుర్రోళ్లు, టక్ జగదీష్ సినిమాల్లో నటించిన కంచరపాలెం కిషోర్ అమ్మవారిని దర్శించుకున్నారు. తెదేపా బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, ఖోఖో అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు దాడి జయవీర్ వీరికి అమ్మవారి చిత్రపటాలు అందించి సత్కరించారు.


నూకాలమ్మ చిత్రపటాలు అందిస్తున్న సురేంద్ర, జయవీర్

బహిరంగ ప్రకటన

నా క్లయింటు SBI, SSME న్యూ ద్వారకానగర్ బ్రాంచ్, విశాఖపట్నం. రిప్రజెంటెడ్ బై ఇట్స్ చీఫ్ మేనేజర్ గారు ఇచ్చిన బోగట్టా ప్రకారం, ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలు ఆస్తి...

1. కొణతాల రాజారావు, కొణతాల మాణిక్య సంతోష్ కుమార్, కొణతాల ప్రకాష్ బాబు, కొణతాల చిరంజీవి మణికంఠల వద్ద నుండి అనకాపల్లి యస్.ఆర్.ఓ.లో దస్తావేజు నెం. 3827/2021 తేది 03-06-2021తేదిన కొణతాల రఘునాథ్ గారు తండ్రి సుబ్రహ్మణ్యం కొనుగోలు చేయబడిన ఆస్తి.

2. కాండ్రేగుల నర్సింగరావు తండ్రి కృష్ణమ్మ వద్ద అనకాపల్లి యస్.ఆర్.ఓ దస్తావేజునెం. 882/2004 తేది : 10-03-2004న బొడ్డేడ శ్రీనివాస్ తండ్రి వెంకట అప్పల స్వామి నాయుడు, అనకాపల్లి గారు కొనుగోలు చేయబడిన ఆస్థి, 1.03ఎకరా ల్యాండు కన్వర్షన్ చేసి ఉన్నాదు.

3. వదరం నూకరాజు, తండ్రి బలరామస్వామి వద్ద అనకాపల్లి యస్.ఆర్.ఓ దస్తావేజునెం. 5544/2005 తేది. 03-10-2005న బొడ్డేడ లక్ష్మి సురేంద్రనాథ్ తండ్రి. వెంకట అప్పల స్వామి నాయుడు, అనకాపల్లి గారు కొనుగోలు చేయబడిన ఆస్థి

పైన తెలిపిన మూడు ఆస్తులపై మా క్లయింటు/బ్యాంకువారు ఋణమంజూరు చేయుటకు సంసిద్ధులై వున్నారు. కావున ఈ క్రింది షెడ్యూలు ఆస్థిపై ఎవ్వరికైనను ఎట్టి తనఖాలు, జప్తులు, క్రయపురోణీలు, హక్కులు, లోనులు వగైరా ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేది లగాయతు 7రోజులలోపు ఈ క్రింది అడ్రసుకి లిఖిత పూర్వకముగా తగు సాక్ష్యాధారములతో తెలియపరచవలెను లేని యెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాద ఆస్తిగా నా క్లయింటు/ బ్యాంకు వారు భావించి ఋణమంజూరు చేయుదురు. ఆ తదుపరి వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు నా క్లయింటు హక్కులను ఏవిధముగాను బంధింపజాలవు.

షెడ్యూల్‌ఆస్తి : ఐటమ్ 1. కొణతాల రఘునాథ్, అనకాపల్లి జిల్లా, అనకాపల్లి యస్.ఆర్.ఓ. అనకాపల్లికి చెందిన సర్వే నెం. 1528/9, లో గల 370చ॥గ ఆస్తి. లేదా 309.36 చ.మీ ఖాళీ స్థలంకి హద్దులు. **తూ** : 30 అడుగుల వెడల్పు రోడ్డు, **ప** : కొణతాల ఆది గణేశ్వరరావు మరియు లీలా పార్వతిలకు చెందిన ఆస్తి, **ఉ** : 30 అడుగుల వెడల్పు రోడ్డు, **ద** : శ్రీదరాల లక్ష్మీనారాయణకు చెందిన ఆస్థి

ఐటమ్ 2. బొడ్డేడ శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా, అనకాపల్లి యస్.ఆర్.ఓ. అనకాపల్లికి చెందిన సర్వే నెం. 778/3 మరియు 794/1సి పట్టా నం. 262, 1555 ద్వారా ఎకరా 1.03సె. నమోదు చేయబడిన ఖాళీ స్థలంకి హద్దులు. **తూ** : బొడ్డేడ వసంత రవికుమార్‌కు చెందిన స్థలం, **ద** : బుద్ద అప్పన్న, కొరిబిల్లి నాగయమ్మలకు చెందిన స్థలం, **ప** : కాలవ, **ఉ** : గొల్లపూడి లలితమ్మ ఇతరులకు విక్రయించిన ఆస్తి

ఐటమ్ 3. బొడ్డేడ లక్ష్మి సురేంద్రనాథ్, అనకాపల్లి జిల్లా, అనకాపల్లి యస్.ఆర్.ఓ. అనకాపల్లికి చెందిన సర్వే నెం. 794/1సి పట్టా నం. 1555, ద్వారా ఎకరా 1.09.2/3సె. నమోదు చేయబడిన ఖాళీ స్థలంకి హద్దులు. **తూ** : బీశెట్టి మహాలక్ష్మినాయుడుకు చెందిన భూమి, **ప** : బుద్ద అప్పన్న, కొరిబిల్లి నాగయమ్మకు చెందిన భూమి, **ద** : బుద్ద అప్పన్న, కొరిబిల్లి నాగయమ్మలకు చెందిన భూమి మరియు కాండ్రేగుల నర్సింగరావు బొడ్డేడ శ్రీనివాసుకు విక్రయించిన భూమి, **ఉ** : ఆస్తి బొడ్డేడ వసంత లక్ష్మికుమార్‌కి చెందినది.

K. SANKAR, Advocate
D.No. 49-38-13, N.G.G.O.'s Colony, Akkayyapalem, Visakhapatnam. **Cell : 9848955228**

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు ఎంపిక



కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు స్థానిక డీపీఎన్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు వి.ప్రభాకర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళవారం గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ కత్తిసాము పోటీలలో ఈ పాఠశాల విద్యార్థి **కె.గుణశేఖర్** అండర్-17 ఫోయల్ స్టయిల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెలలో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతాడని పీడీ తెలిపారు. ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం రవి, విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ నాగమణి అభినందించారు.

అగ్రి సెట్‌లో అనకాపల్లి విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన అగ్రి సెట్‌లో అనకాపల్లి పరిశోధన కేంద్రంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. నేరుగా ఏజీ బీఎస్సీలో ప్రవేశం కోసం ప్రభుత్వం ఏటా అగ్రి సెట్ పరీక్షలు నిర్వహిస్తుంది. వ్యవసాయ పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు దీనిలో పాల్గొంటారు. ఈ ఏడాది నిర్వహించిన పరీక్షల్లో అనకాపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొనగా 16 మందికి ర్యాంకులు వచ్చాయని పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టరు సీహెచ్ ముకుందరావు తెలిపారు. ఎం.అహ్మద్ 13, పి.సుజాత 16, వై.శాంతి 20, కె.రాహుల్ రెడ్డి 41, యు.లిఖిత 43వ ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరితో పాటు మరో 11 మందికి 161 లోపు ర్యాంకులు వచ్చాయన్నారు. వీరందరికీ రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో ఏజీ బీఎస్సీలో సీట్లు వచ్చే అవకాశం ఉందని వివరించారు.

జిల్లాలో 21.2 మి.మీ. సగటు వర్షపాతం

అనకాపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో సోమ, మంగళవారాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సగటున ఒక్కో మండలంలో 21.2 మిల్లీమీటర్ల వర్షం పడిందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలో సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు మొత్తం 509.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మునగపాకలో అత్యధికంగా పడింది. చీడికాడలో వర్షమే కురవలేదు.

25 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన మండలాలివీ..: మునగపాక (76.8), కశింకోట (59.2), పరవాడ (51), బుచ్చియ్యపేట (48.2), ఎలమంచిలి (36.8), అచ్యుతాపురం (35.2), రావికమతం (29.6), అనకాపల్లి (25.8), పాయకరావుపేట (25.4).

సిరిమానుపై ఇలవేల్పు వైభోగం

ఈనాడు, విజయనగరం

సిరులతల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం వైభవంగా సాగింది. పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించగా.. భక్తులు మొక్కులు చెల్లించారు. వేలామంది మహిళలు ఘటాలతో తరలివచ్చారు. కొందరు గొర్రెలు, మేకలు, కోళ్లను తల్లికి సమర్పించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణంరాజు, అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, బేబినాయన, కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు.




దర్శనానికి వెళుతున్న గజపతులు


సిరిమాను ఊరేగింపు

త్రుటిలో తప్పిన పెను ముప్పు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి వద్ద మంగళవారం త్రుటిలో పెనుముప్పు తప్పింది. విజయవాడ నుంచి విశాఖ వైపు ప్రయాణికులతో వెళ్తున్న కారు నక్కపల్లి పీఏసీఎస్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో వాహన ముందు భాగం దెబ్బతినగా, ఇందులో ఉన్న వారంతా అదృష్టవశాత్తు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాద ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. తర్వాత వారు అక్కడి నుంచి మరో వాహనంలో గమ్యస్థానానికి చేరుకున్నారు. వీరు ఎక్కడి నుంచి వస్తున్నది.. ఎవరు అనే వివరాలు తెలియరాలేదు.


ప్రమాదానికి గురైన కారు

'చెప్పాపెట్టకుండా రోడ్డున పడేస్తారా?'

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెజ్‌లో మూసివేసిన అభిజీత్ కంపెనీ ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. కంపెనీ యాజమాన్యం చట్టవ్యతిరేకంగా లే-ఆఫ్ ప్రకటించిందని, యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకొని కంపెనీని తిరిగి తెరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము డిమాండ్ చేశారు. కంపెనీలు ఏర్పాటు చేస్తామని రైతులను నిర్వాసితులను చేసి కోట్లు వ్యాపారం చేసిన యాజమాన్యం.. ఇప్పుడు నష్టాల పేరుతో కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. అనంతరం కంపెనీ నుంచి రెండు కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఏపీఐఐసీ వన్‌స్టాప్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. కార్మికులకు ముందస్తు సమాచారం అందివ్వకుండా కంపెనీని మూసివేయడం చట్టవ్యతిరేకమన్నారు. అనంతరం ఏపీఐఐసీ జెడ్‌ఎం హరిప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. నాయకులు కర్రి అప్పారావు, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.


అభిజీత్ ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన

మద్యం దుకాణం ఏర్పాట్ల అడ్డగింత

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు శారదానగర్ ప్రధాన రహదారిలో కంపోస్టు యార్డు వీధిని ఆనుకొని ఉన్న భవనంలో మద్యం దుకాణం ఏర్పాటు పనులను మంగళవారం రాత్రి స్థానికులు అడ్డుకున్నారు. శారదానగర్‌లో నివాసాల మధ్య దుకాణం ఏర్పాటు చేయవద్దని నిరసన తెలిపారు. స్థానిక వార్డు సభ్యులు, శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు వీరికి మద్దతు తెలిపారు. మద్యం దుకాణం ఏర్పాటు చర్యలను అంగీకరించమని వారంతా ప్రకటించారు. గతంలో మద్యం దుకాణం నిర్వహించిన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సీఐ విజయకుమార్ ఇక్కడకు చేరుకుని భవన యజమానితో మాట్లాడారు. స్థానికుల కోరిక మేరకు ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని నిర్వాహకులను కోరారు. దీంతో స్థానికులు నిరసన విరమించారు.


నిరసన తెలుపుతున్న శారదానగర్ వాసులు

చిత్తడి దారిలో వినూత్న నిరసన

రోలుగుంట, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు రహదారి నిర్మించాలన్న డిమాండుతో ఎంకేపట్నం శివారు కొరుప్రోలు ఆదివాసీలు మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. చిత్తడి దారిలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని బురదలో బైఠాయించి ఆందోళన చేశారు. సీఎంఓ కార్యాలయ అధికారులు స్పందించి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు రెండు నెలల కిందట డీఆర్‌డీఏ పీడీతో పాటు పంచాయతీరాజ్‌శాఖ అధికారులను పంపినా.. ఇప్పటికీ అతీగతి లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.2 కోట్లు కేటాయిస్తామని కలెక్టర్ చెప్పినా.. పల్లె పండగ కార్యక్రమంలో పనులు చేపట్టలేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, ఆనంద్, సుబ్బారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.


బురదలో బైఠాయించి గిరిజనుల నిరసన

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇంటర్ విద్యార్థి దుర్మరణం




పరవాడ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన లంకెలపాలెం నుంచి పరవాడ వెళ్లే ప్రధాన రహదారిలోని రాంకీ ఫైర్‌స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పరవాడ సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం ఈ.భోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలేనికి చెందిన **బొద్దపు హేమంత్** (16) ఉక్కునగరంలోని ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి ఒరిజినల్ మార్కులిస్టును తెచ్చుకోవడానికి లంకెలపాలెంలోని పూర్వ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన బొద్దపు దశిధర్ (19)తో కలిసి ఇద్దరూ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. స్వగ్రామానికి తిరిగొస్తుండగా రాంకీ ఫైర్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం అనకాపల్లిలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హేమంత్ మృతి చెందాడు. దశిధర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీ.ఐ వెల్లడించారు. మృతుడు హేమంత్ తండ్రి నాగరాజు పొక్లెయిన్ డ్రైవర్. తల్లి నాగమణి గృహిణి. అల్లారుముద్దుగా పెంచుకున్న పెద్దకుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గొర్రె పిల్లను అమ్మిన డబ్బులు ఇవ్వలేదని..

తండ్రిని హత్య చేసిన తనయుడు

విశాఖపట్నం (వేపగుంట), న్యూస్‌టుడే: కుటుంబంతో సరదాగా గడిపేందుకు దసరా పండుగకు ఇంటికొచ్చిన ఓ తండ్రి తనయుడి చేతిలో దారుణ హత్యకు గురైన ఉదంతమిది. గొర్రె పిల్లను అమ్మగా వచ్చిన డబ్బులు అడిగితే ఇవ్వలేదని అత్యంత కిరాతకంగా కత్తితో గొంతుకోసి మరీ ఈ దారుణానికి ఒడిగట్టిన ఘటన విశాఖపట్నంలోని నరవ పరిధి మన్నెపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పెందుర్తి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నెపాలెంలో యంగలి దేవుడు (60), భార్య దేవి, కుమారులు గోపీ, అచ్యుతరావు కలిసి నివసిస్తున్నారు. దేవుడు తోట పనులు చేసేందుకు తెలంగాణ ప్రాంతానికి వెళ్లి వస్తుంటారు. భార్య స్థానికంగా కూలి పనులు చేయగా.. చిన్న కుమారుడు గోపీ (25) తనకు నచ్చితే బిల్డింగ్ సెంట్రింగ్ పనులకు వెళ్తుంటాడు. పెద్ద కుమారుడు అచ్యుతరావు ప్రయివేటుగా భూముల సర్వేలు చేస్తుంటారు. దసరా పండుగకు కుటుంబంతో సరదాగా గడిపేందుకు దేవుడు ఇంటికొచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో గోపీ ఇంట్లో ఉన్న తండ్రితో గొడవపడ్డాడు. ఇటీవల ఒక గొర్రె పిల్లను దేవుడు అమ్మగా ఆ డబ్బులు ఇవ్వమని గోపీ పట్టుపట్టాడు. తండ్రి నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన గోపీ క్షణికావేశంలో తండ్రిని మంచంపై పడేసి అత్యంత కిరాతకంగా కత్తితో గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. తలుపులు తీసి ఇంట్లో నిశ్శబ్దంగా ఉండటం గమనించిన స్థానికులు లోపలికి వెళ్లి చూడగా దేవుడు రక్తపు మడుగులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటనతో మన్నెపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. మద్యానికి బానిసై చేతిలో డబ్బులు లేకపోవడంతో తండ్రితో గొడవపడి ఇంతటి దారుణానికి పాల్పడినట్లు కాలనీవాసులు చెబుతున్నారు.


యంగలి దేవుడు (పాతచిత్రం)


నిందితుడు గోపి (పాతచిత్రం)

మంటల్లో గాయపడి ఒకరి మృతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బైకు నుంచి ఎగిసిన మంటల్లో గాయపడిన కోటవురట్ల మండలం రామన్నపాలేనికి చెందిన లాలం నూకినాయుడు (39) విశాఖపట్నంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్సై రమేష్ తెలిపారు. ఈ నెల పదో తేదీన పెదబొడ్డేపల్లి పెద్దమదుం వద్ద ఓ మెకానిక్ దుకాణంలో బైకు నుంచి ఎగిసిన మంటల్లో నూకినాయుడు తీవ్రంగా గాయపడ్డాడని చెప్పారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **మార్టిన్,** శ్రీ సత్య: **మా నాన్న,** సత్యనారాయణ స్క్రీన్‌1: **విశ్వం,** స్క్రీన్‌2: **శ్వేగ్** వెంకటేశ్వర: **జిగ్రా,** పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్,** షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్‌-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్‌-2: **దేవర**

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అంతా ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌డీఓ ఉదయశ్రీ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయించాలన్నారు. తుపాను నేపథ్యంలో సన్నద్ధతకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ డి.సీతారామరాజు, ఏఈ దుర్గాశంకర్, ఇన్‌ఛార్జి ఈఓఆర్డీ ఎం.శ్రీను, ఏపీఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మూతలు లేని కుళాయిలు.. తాగునీరు వృథా

అరట్లకోటలో తాగునీటి కుళాయిల వద్ద వృథాను అరికట్టేందుకు ట్యాప్‌లు లేవు. కొన్నిచోట్ల విరిగిన పైపులు కనిపిస్తున్నాయి. దీంతో నిత్యం వేల లీటర్ల తాగునీరు నేలపాలవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం



అరట్లకోట పంచాయతీ కార్యాలయం సమీపంలో..



మూత లేకపోవడంతో నేలపాలవుతున్న నీరు

గ్రామంలో సుమారు మూడు వేల మంది జనాభా ఉన్నారు. వీరికి తాగునీరు అందించేందుకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో, ఎస్సీ కాలనీ వద్ద ట్యాంకులు నిర్మించారు. రోజుకు సుమారు 70 వేల లీటర్లకు పైగా నీరు గ్రామస్థులకు పంచాయతీ వీధి కుళాయిల ద్వారా సరఫరా అవుతోంది. పలువీధుల్లో నీటి వృథాను అరికట్టేందుకు కుళాయిలకు మూతలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో మహిళలే స్వచ్ఛందంగా కర్రలు అడ్డుపెట్టి నీరు వృథా కాకుండా చూస్తున్నారు.

మూతల ఏర్పాటుకు చర్యలు

సమస్యపై ఇన్‌ఛార్జీ ఇవోపీఆర్డీ సత్యనారాయణకు వివరించగా తక్షణమే సర్పంచితో చర్చించి నీటి వృథాను అరికడతామని తెలిపారు.

– వై.సత్యనారాయణ, ఇన్‌ఛార్జీ ఇవోపీఆర్డీ

సమస్యపై పలుమార్లు వివరించాం..

కుళాయిల నుంచి నీటి వృథాను అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు పంచాయతీ పాలకులకు, అధికారులకు వివరించాం. సమస్యపై చొరవ తీసుకోలేదు. కారణంగా రహదారులు బురదగా మారుతున్నాయి. దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. సంబంధిత అధికారులు ట్యాప్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఆదినారాయణ (గ్రామస్థుడు)

చోడవరం రహదారికి మరమ్మతు

రూ. పది లక్షలతో పనులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రహదారి మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అనకాపల్లి నుంచి మామిడిపాలెం వరకు నాలుగు కిలోమీటర్ల మేర రహదారిలో భారీగా గోతులు పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టి వాహనదారుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది దీనిలోభాగంగా గుండాల కూడలి, తుమ్మపాల, మార్టూరు, దర్జీనగర్, బవులవాడ, మామిడిపాలెం ప్రాంతాల్లో భారీగా గోతులు పడి వర్షపునీరు నిల్వ ఉండిపోతున్న ప్రాంతాల్లో మరమ్మతు పనులకు ఈ నిధులు కేటాయించారు పనులకు టెండర్లు పిలిచారు. ఖరారైన వెంటనే పనులు చేపడతామని ఆర్ అండ్‌బీ ఏఈ ప్రభు తెలిపారు. అయిదేళ్లుగా రహదారి మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించేలా మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నారు.



మరమ్మతుకు గురైన తుమ్మపాల రహదారి

ఎన్‌డీబీ నిధులతో విస్తరణ..

అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రహదారి పనులకు ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) నుంచి వైకాపా ప్రభుత్వం నిధులు తెచ్చి పనులు చేపట్టలేదు. దీంతో కొంతవరకు పనులు చేపట్టి వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఎన్‌డీబీ ఉన్నతాధికారులతో చర్చించి ఈ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నిధులతో విస్తరణతోపాటు విశాలమైన రహదారి నిర్మించే అవకాశం ఉంది. అయితే ఎన్‌డీబీ నిధులతో పనులు చేపట్టేలోగా రూ.10లక్షలతో భారీగా గోతులకు మరమ్మతులు చేపట్టి వాహదారుల ఇబ్బందులు తొలగించనున్నారు.



దర్జీనగర్ వద్ద దెబ్బతిన్న రహదారి

అ వీ ఇ వీ

తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తల్లి అదృశ్యంపై కుమారుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తుమ్మపాలకు చెందిన ఎర్రంశెట్టి నాగమణి(69) సోమవారం ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదని కుమారుడు హరిశేఖర్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

రూ.10 నాణేలపై విస్తృత ప్రచారం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న యూనియన్ బ్యాంకు సిబ్బంది రూ.10 నాణేలపై మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ నానాజీ ప్రతి దుకాణం వద్దకు వెళ్లి రూ.10 నాణేలు అందించి ఇవి చెల్లుబాటే అయ్యేలా ప్రచారం చేయాలని అవగాహన కల్పించారు. బ్యాంకు ఉద్యోగులు కాండ్రేగుల హరికృష్ణ, ఆడారి రాము పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

ఎస్‌.రాయవరం: పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు, సమన్వయకర్త సత్యనారాయణ, కోశాధికారి సామ్యూల రాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరి పంటకు పురుగు ముప్పు

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటకు పురుగులు సోకే ప్రమాదం ఉందని పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పరిశోధన కేంద్రం ఆవరణలో మంగళవారం వాతావరణ ఆధారిత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఏడీఆర్ ముకుందరావు మాట్లాడుతు పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32 నుంచి 33 సెల్సియస్ డిగ్రీలు ఉంటాయన్నారు. వరి పంటకు కాండంతొలుచు, ఆకుముడత పురుగులు సోకుతాయన్నారు. రైతులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాస్త్రవేత్తలు గౌరి, భవానీ, పద్మావతి, అలివేణి పాల్గొన్నారు.

సాగులో మహిళల ప్రగతి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదదొడ్డిగల్లులో మంగళవారం మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీటీ శాస్త్రవేత్త శైలజ కర్రా, వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా రైతులు ఒమ్మి గంగ, ఇసరపు నాగలక్ష్మిని సత్కరించారు. పెదదొడ్డిగల్లుతోపాటు, నక్కపల్లిలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి సాగు విషయంలో రైతులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా వనరుల వ్యవసాయాధికారి తులసి మణి, గొర్ల నాగ అప్పలరాజు పాల్గొన్నారు.



మహిళా రైతును సత్కరిస్తున్న అధికారులు

ఇన్‌ఛార్జి జెడ్సీ చిరంజీవులు

స్పందనకు వందనం

అనకాపల్లి: జీవీఎంసీ అనకాపల్లి జోనల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎస్‌.చిరంజీవులును నియమిస్తూ కమిషనర్ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును బదిలీచేసి 11 రోజులు కావొస్తున్నా ఇంతవరకు ఎవరినీ నియమించలేదు. దీనిపై 'జోనల్ కార్యాలయంలో అధికారులేరి?' అనే శీర్షికతో 'ఈనాడు'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఇన్‌ఛార్జి కమిషనర్‌ను నియమించారు.

విద్యుత్తు మోటారు ఏర్పాటు

మునగపాక, న్యూస్‌టుడే: మూలపేటలో రక్షిత నీటి పథకం మోటారు మరమ్మతులకు గురైంది.ంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస కొత్తది ఏర్పాటు చేయించారు. సర్పంచి భీశెట్టి గంగప్పలనాయుడు, పాల సంఘం అధ్యక్షుడు శరగడం నాగేశ్వరరావు, కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శివదత్‌కు సత్కారం

పాయకరావుపేట: నియోజకవర్గ రేషన్ డీలర్ల సంఘం నాయకులు పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్ మంగళవారం పేటలో కలిసి సత్కరించారు. సంఘం నాయకులు జి.చిట్టిబాబు, వై.అప్పలనాయుడు, టి.శేఖర్, కనకరాజు, ఎ.బుల్లిదొర పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని జీవీ కోటేశ్వరరావు వీధిలో సీసీ రోడ్డు గోతులుగా మారింది. మురుగు కాలువ నిర్మించక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. –రామచంద్రరావు, అనకాపల్లి

✓: రహదారి మరమ్మతులు, మురుగు కాలువ నిర్మించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – చిరంజీవి, జీవీఎంసీ జోనల్ ఈఈ, అనకాపల్లి.

నావికాస్థావరం ప్రహరీ పనుల పరిశీలన

రాంబిల్లి, న్యూస్‌టుడే: ప్రత్యామ్నాయ నావికాస్థావరం(ఎన్‌ఏఓబీ) ప్రాజెక్టులో భాగంగా అటవీ భూముల చుట్టూ డీఆర్‌డీఓ పర్యవేక్షణలో నిర్మిస్తున్న రక్షణశాఖ ప్రహరీ పనులను మంగళవారం అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా పరిశీలించారు. రక్షణశాఖ ప్రహరీతో తమకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటూ వై.లోవ, పెదకలవలాపల్లి, చినకలవలాపల్లి గ్రామస్థులు గతంలో ఆందోళనలు చేపట్టారు. పెదకలవలాపల్లిలో మహిళా రైతులు రిలేదీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రహరీ పనులు ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, సీఐ నరసింగరావులతో సమీక్షించారు. ప్రహరీ పనులకు ఆటంకాలు ఎదురవడంపై తెలుసుకున్నారు. ఈ పనులకు అందరూ సహకరించేలా అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శ్రీనివాస్‌కు సూచించారు.



తహసీల్దారు, సీఐతో సమీక్షిస్తున్న ఆర్డీఓ అయిషా

సాగునీటి సంఘాల ఎన్నికల ఓటర్లపై సర్వే

కోటవురట్ల, న్యూస్‌టుడే: త్వరలో నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్లపై సర్వే చేపట్టారు. తహసీల్దార్ తిరుమలబాబు సూచనల మేరకు మంగళవారం బాపిరాజు కొత్తపల్లి వీఆర్వో హంసాదేవి రెవెన్యూ పరిధిలోని పంట కాలువలు, చెరువుల ఆయకట్టుపై ఆధారపడి పంటలు పండించే రైతుల వివరాలను పరిశీలించారు. గతంలో కాలువ ఎన్నికల్లో ఓట్లు వేసిన రైతుల వివరాల జాబితా పరిశీలించారు. ఓట్లు ఉన్న రైతులను పిలిపించి, ఓటు ఎక్కడ ఉందనే దానిపై వివరాలు నమోదు చేసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సరికి ఓటర్ల జాబితను సిద్ధం చేయాలని తోటి సిబ్బందికి తెలియజేశారు.

అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యా సంస్థల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఏఎంఏఎల్ కళాశాలలో ఆయన విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ గెల్లా జయబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు పి.అనూరాధ తదితరులు నివాళులర్పించారు. సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఆళ్ల ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ నివాళులర్పించారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, శ్రీధర్, విజయలక్ష్మి, నారాయణరావు, బాబు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం అందరికీ స్ఫూర్తని డీఎల్‌డీఓ ఉదయశ్రీ వెల్లడించారు. నక్కపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఆయన జయంతిని నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు, ఎంపీడీఓ డి.సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి, ఇన్‌ఛార్జి ఈఓఆర్డీ ఎం.శ్రీను పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మూడు ప్రైవేటు పాఠశాలల్లో అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలాం జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంని యువత ఆదర్శంగా తీసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని మంగళవారం అనకాపల్లిలో అబ్దుల్‌కలాం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు జరిగాయి. విద్యార్థులకు ఆయనకు ఘన నివాళి అర్పించారు.



ఏఎంఏఎల్ కళాశాలలో కలాం విగ్రహం వద్ద ప్రిన్సిపల్ జయబాబు తదితరులు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మునగపాక, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిందని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాటలు పట్టిస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. వాడ్రాపల్లి, గొల్లలపాలెం, మెలిపాక, చూచుకొండ, గణపర్తి, తిమ్మరాజుపేట, ఒంపోలు, నాగులాపల్లిలో మంగళవారం పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో వెనుకబాటు, తెదేపాకు కంచుకోటగా ఉన్న గొల్లలపాలెంను దత్తత తీసుకొన్నానని చెప్పారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీఓ శిరీష, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, నేతలు దాడి ముసిలినాయుడు, దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామాల్లో 4వేల కోట్లతో 30 వేలకు పైగా అభివృద్ధి పనులు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దక్కుతుందని పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ పేర్కొన్నారు. అక్కిరెడ్డిపాలెం, కోడూరు, మారేడిపూడి, గోపాలపురం, గొలగాం, కోడూరు తదితర గ్రామాల్లో మంగళవారం పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసిన పనులు ప్రారంభించారు. తారకరామాకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం: పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీడీవో జయప్రకాశరావు తెలిపారు. పెదరామభద్రపురం, కొత్తూరు, ఎస్.నర్సాపురం గ్రామాల్లో సీసీ రహదారులు, పుంత దారుల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గ్రామాలకు కేటాయించినట్లు వెల్లడించారు. అధికారులు హేమలత, సత్యనారాయణ, రామగోవింద్, నాయకులు కనిగట్ల శ్రీను, సింగంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని తెదేపా మండల కమిటీ అధ్యక్షులు జానకి శ్రీను అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బాపిరాజు కొత్తపల్లి, రామచంద్రపాలెం, నీలిగుంట గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను ఉపాధి ఏపీఓ నాగరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ తిరుమలబాబు, సర్పంచి లింగన్ననాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట, న్యూస్‌టుడే: పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని పలు పంచాయతీలలో రోడ్లు, కాలువల నిర్మాణం కోసం భూమిపూజాకార్యక్రమాలు, శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. తేగాడలో రూ.13లక్షలు, పేరంటాలపాలెంలో రూ.17లక్షలు, జోగారావుపేటలో రూ.19 లక్షలు, కొత్తపల్లిలో రూ.6లక్షలు, బుచ్చెయ్యపేటలలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లుకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. పేరంటాలపాలెం గ్రామంలో క్రెబ్ బయో కెమికల్ కర్మాగారం ఏర్పాటుచేసిన మినరల్ ప్లాంట్‌ను మండల ప్రత్యేకాధికారిణి రోజారాణితో కలిసి ప్రారంభించారు. పార్టీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీధర్, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గొల్లలపాలెంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విజయకుమార్



అక్కిరెడ్డిపాలెం పల్లె పండగలో మాజీ ఎమ్మెల్యే గోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ తదితరులు

భక్తిశ్రద్ధలతో చందనం ఊరేగింపు

కశింకోట, న్యూస్‌టుడే: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన కశింకోటలో సయ్యద్ అబ్దుల్ అజీజ్‌షా ఖాదరీ బాబా ఉరుసు (చందనోత్సవం) మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఖాదరీ బాబా సమాధిని భారీసంఖ్యలో హిందూ ముస్లింలు దర్శించుకుని ప్రార్థనలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై చందనాన్ని ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దర్గా చేరుకున్న చందనాన్ని బాబా సమాధికి పూశారు. భక్తులకు ప్రసాదంగా అందించారు. రాత్రికి ఫాతెహ (ఆరాధన) ఖవ్వాలి పోటీలు నిర్వహించారు. దర్గాకమిటీ అధ్యక్షులు చిక్కం గురుప్రసాద్, సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాదరీ, సయ్యద్ జిలానీ, సయ్యద్ జాఫర్ అలీ, సయ్యద్ అక్బర్ అలీ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో ఊరేగింపు సాగింది. సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్సై మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



చందనాన్ని దర్శించుకుంటున్న హిందూ, ముస్లింలు

సభాపతికి సత్కారం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని మంగళవారం తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు సత్కరించారు. అమెరికాలో తానా సభల్లో పాల్గొని నర్సీపట్నం చేరుకున్న అయ్యన్నపాత్రుడిని నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆయనకు వివరించారు.



అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎస్‌.రాయవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు భోజనానికి ముందు, ఆటలు ఆడిన తరువాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వాసంతి సూచించారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌ఎన్ రత్నసఖి, సూపర్‌వైజర్ ప్రకాష్, క్లస్టర్ సూపర్‌వైజర్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఎక్కువ అనారోగ్య సమస్యలు చేతుల ద్వారా వస్తున్నాయని అచ్యుతాపురం, హరిపాలెం వైద్యాధికారిణులు శ్రావ్య, సుగుణ తెలిపారు. అంతర్జాతీయ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోకపోవడం వల్ల కలిగే ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో గుల్లిపాడు-నర్సీపట్నం స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (35) ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి మోచేతిపై గీతా జీకె అనే పచ్చబొట్టు మాత్రమే ఆంగ్ల అక్షరాల్లో ఉందన్నారు.

పిల్లల్లో లోపాలను గుర్తించి బోధన

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: తరగతి గదుల్లో డిస్లెక్సియా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందజేయాలని సహిత విద్య జిల్లా సమన్వయకర్త శకుంతల కోరారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియా అవగాహన సదస్సు, ర్యాలీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. బోధనలో విద్యార్థి ప్రవర్తనను ముందుగా ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రత్యేక విద్య ఉపాధ్యాయుడు బీవీ వరప్రసాద్, శ్రీధర్, బాబు, చిన్నబ్బాయ్ పాల్గొన్నారు.

నక్కపల్లి: గొడిచెర్ల ఉన్నత పాఠశాలలో అభ్యసనా వైకల్యంపై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ 2 వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. షేక్ యాస్మిన్ పాల్గొన్నారు.

పాయకరావుపేట: చిన్నారుల్లో మానసిక పురోభివృద్ధిని మరింతగా పెంచాలని ఎంఈఓ-2 రమేష్ తెలిపారు. పట్టణంలోని పీహెచ్‌వాడ ప్రాథమిక పాఠశాలలో డిస్లెక్సియా అవగాహనలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, అప్పలనాయుడు, విజయ్‌కుమార్, క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



మామిడిపాలెంలో సామూహిక ప్రతిజ్ఞ



పేటలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

చీడపీడల నివారణపై సూచనలు

ఎస్‌.రాయవరం, రాంబిల్లి, న్యూస్‌టుడే: ధర్మవరం-అగ్రహారం, ఎస్‌.రాయవరం గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి సౌజన్య వరి పొలాలను సందర్శించి, వరిలో చీడపీడల నివారణకు చర్యలను రైతులకు వివరించారు. రాంబిల్లి మండలం గోకివాడ, మర్రిపాలెం గ్రామాల్లో పర్యటించిన మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత వరి పంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు.

కశింకోట, కొత్తూరు (అనకాపల్లి): చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారిణి ఎం.స్వప్న తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. అనకాపల్లి మండలం వెంకుపాలెంలో అవగాహన సదస్సు, క్షేత్ర పర్యటన కార్యక్రమాలు మండల వ్యవసాయాధికారి రంగాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచి రాపేటి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రామాయణ, మహాభారతాలపై విద్యార్థులు పరిజ్ఞానం పెంచుకోవాలని తెలుగుభాషా పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. రామాయణంపై ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలో గెలుపొందిన వారికి మంగళవారం హిమశేఖర్ పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ కొణతాల జనార్దన్, ప్రిన్సిపల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల



విద్యార్థులతో చేతులు కడిగిస్తున్న ఉపాధ్యాయులు

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: చేతులను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము విద్యార్థులకు సూచించారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా చేతుల శుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం: అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సభాపతి అయ్యన్నపాత్రుడు మంగళవారం అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో చర్చించి గబ్బాడ యార్డులో ఇసుక నిల్వల విక్రయాలను ప్రారంభించాలని గనుల శాఖ ఏడీ శివాజీని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీపాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్రను ఆదేశించారు. ఆర్డీవో రమణ, తహసీల్దారు రామారావు, తాండవ డీఈఈ అనూరాధ, డీఆర్‌డీఏ పీడీ పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో రమణకు సూచనలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: విశ్వం, మార్టిన్ ఆడి2: జిగ్రా, శ్వాగ్, మా నాన్న సూపర్ హీరో ఆడి3: దేవర, ఆడి4: వేట్టయన్, జనక అయితే గనక రాజు: వేట్టయన్ బంగార్రాజు: దేవర, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వేట్టయన్ సాయిలక్ష్మి: శ్వాగ్, పూర్ణా: దేవర

అ వీ ఇ వీ

అభ్యంతరాల స్వీకరణకు గ్రామసభలు

నాతవరం, న్యూస్‌టుడే: భూసర్వే జరిగిన పంచాయతీల్లో అభ్యంతరాల స్వీకరణకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు వేణు గోపాల్ చెప్పారు. ఈ నెల 17 నుంచి నవంబరు 11 వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. సర్వేలో లోపాలు, సరిహద్దు వివాదాలు, ఆక్రమణలు, అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

కె.కోటపాడు: సూదివలసలో ఈ నెల 17న గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దారు భాగ్యవతి చెప్పారు.

రోలుగుంట: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శంకర్ తెలిపారు. 17న బొట్టవాని గైరంపేటలో సభ జరుగుతుందన్నారు.

బుచ్చెయ్యపేట: రెవెన్యూ సంబంధ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు లక్ష్మి తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆర్ఓఆర్ రికార్డుల్లో తుది సవరణలు, అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేయవచ్చన్నారు.

పీఏసీఎస్ మహాజన సభ నేడు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) మహాజన సభ బుధవారం నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈఓ వరహాలదొర చెప్పారు. సభ్యత్వం ఉన్న రైతులందరూ హాజరుకావాలని కోరారు.

సిమెంటు బల్లల వితరణ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కుటుంబసభ్యులు మూడు సిమెంటు బల్లలు, చెక్క బెంచీలను మంగళవారం అందజేశారు. పిల్లలను చూసేందుకు పాఠశాలకు వచ్చే తల్లిదండ్రులు వేచి ఉండేందుకు వీటిని అందజేసినట్లు కొరుప్రోలు ఈశ్వరరావు చెప్పారు. ప్రిన్సిపల్ త్రివేణి, స్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్ సరోజిని, నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మేకలు, గొర్రెల్లో నట్టల నివారణకు ఉచితంగా మందు పంపిణీ చేయనున్నట్లు మాడుగుల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు చెప్పారు. ఈ నెల 16 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

దేవరాపల్లి: మండలంలో 5933 గొర్రెలు, 9780 మేకలకు నెలాఖరులోగా నట్టల నివారణ మందులు వేయనున్నట్లు పశువైద్యాధికారిణి మంజుషారాణి చెప్పారు.

అబ్దుల్ కలాంకు నివాళి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక అయ్యన్న విద్యాసంస్థల విద్యార్థులు మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యా సంస్థల అధినేత ఖాసిం, డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపల్ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నిలయాలు.. హరిత ఆలయాలు

పాఠశాలలకు సమయానికి వచ్చామా, పిల్లలకు పాఠాలు చెప్పామా, సాయంత్రం గంట కొట్టగానే వెళ్లిపోదామా అని కాకుండా సరస్వతి నిలయాలను హరిత ఆలయాలుగా తీర్చిదిద్దారు. విద్యార్థులనూ భాగస్వాములను చేశారు. కొత్తగా పాఠశాలల్లో చేరేందుకు వచ్చే చిన్నారులకు ఆవరణ నిండుగా పరుచుకున్న పచ్చదనం స్వాగతం పలుకుతోంది. నర్సీపట్నం మండలంలోని గ్రామీణ విద్యాలయాలను హరిత లోగిళ్లుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది.



యరకన్నపాలెం బడిలో హరిత శోభ



గబ్బాడలో స్కూల్‌లో స్వాగతం పలుకుతున్న పచ్చదనం



నీలంపేట పాఠశాలలో ఆకట్టుకుంటున్న క్రోటన్స్

గబ్బాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల బృందావనంలా దర్శనమిస్తోంది. ప్రధానోపాధ్యాయిని అన్నపూర్ణాదేవి, ఉపాధ్యాయిని ఇంద్రావతి క్రోటన్స్, బాదం, ఉసిరి, మునగ తదితర మొక్కలను నాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. యరకన్నపాలెం పాఠశాలను హెచ్ఎం ఆళ్ల వరప్రసాద్ ఉద్యానంలా మార్చేశారు. గోంగూర, తోటకూర, బెండ, అరటి పండిస్తున్నారు. ఇక్కడ పండే కూరగాయలు, ఆకుకూరలను మధ్యాహ్న భోజనంలో వండి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. నీలంపేట ప్రాథమిక పాఠశాల పూదోటను తలపిస్తోంది. హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా శ్రమదానం చేస్తున్నారు. పిల్లలంతా తమ పుట్టిన రోజున మొక్కలు తెచ్చి పాఠశాలలో నాటి సంరక్షిస్తున్నారు.

– న్యూస్‌టుడే, నర్సీపట్నం

మండల సమావేశంలో సర్పంచుల వాగ్వాదం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ధర్మసాగరం సర్పంచి గొంప కన్నయ్యనాయుడు ఆరోపించగా.. 'ఇప్పుడు గుర్తొచ్చిందా, వైకాపా ప్రభుత్వంలో ఎంతగా అవమానించారో మర్చిపోయారా' అంటూ గబ్బాడ సర్పంచి ఈర్లె రాజేశ్వరి అనడంతో మండల పరిషత్తు సమావేశంలో వాగ్వాదం చోటుచేసుకుంది. నర్సీపట్నం మండల సమావేశం ఎంపీపీ రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైంది. ఎంపీపీతోపాటు జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రామప్రసాద్ జోక్యం చేసుకుని సర్పంచులు ఇద్దరికి సర్దిచెప్పారు. అనంతరం రామప్రసాద్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. వీటిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వేములపూడిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. స్థలాలు ఇప్పిస్తాం. భవనాలు నిర్మించండని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ.. నిత్యావసర సరకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. వైస్ ఎంపీపీ తాతబాబు, ఎంపీడీవో ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఎంపీపీ రాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, ఎంపీడీఓ ఉషశ్రీ



గబ్బాడ సర్పంచి రాజేశ్వరి, ధర్మసాగరం సర్పంచి కన్నయ్యనాయుడు వాగ్వాదం

అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర కీలకం

కె.కోటపాడు, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని కె.కోటపాడు ఎంపీడీవో సాంబశివరావు చెప్పారు. స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సుపరిపాలన అందించేందుకు కృషి చేయాలన్నారు. కె.కోటపాడులో 17 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి పాల్గొన్నారు. మాడుగులలో ఎంపీపీ రాజారాం, ఎంపీడీవో అప్పారావు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈవోఆర్డీ కరుణాకరరావు పాల్గొన్నారు.

చోడవరం పట్టణం: గ్రామ పరిపాలనపై పంచాయతీ పాలకులు దృష్టిసారిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కాసులమ్మ, ఈవోఆర్డీ మహేష్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ప్రారంభంలో ఎంపీపీ రాజారాం తదితరులు

సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: విప్పలపాలెం ఆయకట్టు రైతులు సాగునీటి కాలువలను శ్రమదానంతో బాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుక మేటలు, పిల్ల కాలువల్లో తుప్పలను తొలగిస్తున్నారు. అమ్మపేట, కొత్తమల్లంపేట, విప్పలపాలెం, చోద్యం, గాదంపాలెం రైతులు మంగళవారం శ్రమదానం చేశారు.




ఇసుక మేట తొలగిస్తున్న రైతులు

కోనాం కళకళ.. నిధులు గలగల

ఆనకట్ట, గేట్ల మరమ్మతుకు రూ.99 లక్షలు మంజూరు

ఎమ్మెల్యే బండారు ప్రకటనతో రైతుల్లో ఆనందం

చీడికాడ, న్యూస్‌టుడే



గేట్ల నుంచి లీకవుతున్న నీరు

మాడుగుల నియోజకవర్గంలోని జలాశయాల్లో ఒకటైన కోనాం మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుకు మహర్దశ పట్టనుంది. వైకాపా సర్కారు జలాశయం నిర్వహణ, మరమ్మతుకు ఐదేళ్లలో పైసా ఇవ్వలేదు. నాటి ప్రజాప్రతినిధులు పదవులు, అధికారాన్ని అనుభవించారే తప్ప రైతుల గోడును ఆలకించలేదు. సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయకట్టుదారుల ఇబ్బందులపై దృష్టి సారించింది. జలాశయం నిర్వహణతోపాటు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

కోనాం జలాశయం ఐదు దశాబ్దాల కిందట నిర్మితమైంది. చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, చోడవరం మండలాల్లో 14,450 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాల్సి ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. నిర్వహణకు ఏటా నిధులు విడుదల చేసేది. వైకాపా ప్రభుత్వం ఒక్కటే నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపింది. జలాశయం గేట్లకు గ్రీజు పూసేందుకూ చిల్లిగవ్వ లేని దుస్థితి. అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడమే తప్ప.. నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు చూపిన చొరవ శూన్యం. పాలకుల తీరుతో విసిగిపోయిన రైతులు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. జలాశయం, సాగునీటి కాలువలు, ఆనకట్టను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్థానిక నాయకులు, రైతులతో కలిసి ఇటీవల పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. ప్రతిపాదనలతో అమరావతి వెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. 'ఈ నిధులతో జలాశయం స్పిల్‌వే గేట్లు, తూములకు రబ్బరు తొడుగులు, మరమ్మతు చేయిస్తాం. ఆయకట్టు పరిధిలోని బొడ్డేరు నదిపై సిరిజాం, మర్లగుమ్మి, మంగళాపురం ఆనకట్టలనూ బలోపేతం చేస్తామ'ని కోనాం జలాశయం ఏఈ జయరామ్ పేర్కొన్నారు.



శిథిలమైన మర్లగుమ్మి ఆనకట్ట



ఎన్నికలో సమయంలోనే..: కోనాం జలాశయం సమస్యలను ఆయకట్టు రైతులు ఎన్నికల ప్రచార సమయంలోనే మా దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సాగునీటి రంగంపై దృష్టిసారించా. మాడుగుల నియోజకవర్గంలోని అన్ని జలాశయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకున్నా. తొలి విడతగా కోనాం జలాశయానికి రూ.99 లక్షలు మంజూరయ్యాయి.

– బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే

పల్లెల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కేజేపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

రావికమతం, న్యూస్‌టుడే: ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పల్లెల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దొండపూడి, మత్స్యవానిపాలెం, జెడ్.బెన్నవరం, టి.అర్జాపురం, పి.పొన్నవోలు, మేడివాడ, గర్నికం, రావికమతం, గుడివాడ, మరుపాక, గుడ్డిప, గొంప గ్రామాల్లో పర్యటించారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. తహసీల్దారు వెంకటరమణ, సర్పంచులు గెంజి మంగ మోదినాయుడు, వజ్రపు లీలాశివ, ఫాల్గుణ, ఎంపీటీసీ సభ్యులు వేపాడ లక్ష్మీనాగేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు శ్రీనివాసరావు, వెంకటాచారి, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, అర్జున, శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ పథకాల అమలు దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. కేజేపురంలో మంగళవారం సీసీ రోడ్లు, శ్మశానం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాటిపర్తి, శంకరం గ్రామాల్లో ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, ఎంపీపీ రాజారాం, ఎంపీడీవో అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, నాయకులు అప్పలరాజు, జగ్గారావు, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

నాతవరం, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా నాయకులు కరక సత్యనారాయణ పేర్కొన్నారు. గన్నవరం, వీరభూపతిఅగ్రహారం, మన్యపురట్లలో మంగళవారం పల్లె పండగ నిర్వహించారు. రెండు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏఈ వెంకటేశ్వరమ్మ, ఏపీవో చిన్నారావు, నాయకులు పాల్గొన్నారు. పాత కృష్ణదేవిపేటలో కూటమి నాయకులు చిటికెల తారకవేణుగోపాల్, గోపాలకృష్ణ, సహదేవుడు, రమణ, బుజ్జి తదితరులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ మణికుమారి, జనసేన నాయకులు శివ, అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: శెట్టిపాలెం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, జడ్.గంగవరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, నాయకులు రామునాయుడు, నందకిషోర్, స్వామి, చిరంజీవి పాల్గొన్నారు.



పాత కృష్ణదేవిపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



గన్నవరంలో చెరువు గట్టు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే రాజు సూచించారు. గోవాడలో మంగళవారం అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్, బాల్ బాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేశారు. సర్పంచి బాలాజీ, హెచ్ఎం రాము, మాజీ సర్పంచి ఏడువాక లక్ష్మణకుమార్, నాగగంగాధర్, అర్జునరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ సర్పంచి లక్ష్మణకుమార్ తదితరులు

జిల్లా స్థాయి ఆటల పోటీలు నేడు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి ఆటల పోటీలు జరగనున్నాయని ఎంఈఓ పడాల్‌దాసు తెలిపారు. అండర్-14 విభాగంలో సెపెక్ తక్రా, ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు.

ఒప్పంద అధ్యాపకుల నిరసన

రావికమతం, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండు చేస్తూ కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిరసన తెలిపారు. పసుపు రంగు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుల ఆందోళన రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతూ ప్రిన్సిపల్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు.



కొత్తకోట కళాశాల వద్ద నిరసనలో అధ్యాపకులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే

సమస్య: కందిపూడిలో ఆరోగ్య ఉప కేంద్ర భవనం పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. పిల్లర్లు నిర్మించి వదిలేయడంతో తుప్పలు పెరిగి ఇనుప చువ్వలు తుప్పు పడుతున్నాయి. – రామారావు, కందిపూడి



❖ పరిశీలించి ప్రతిపాదనలు పంపుతాం. – ఎంపీడీఓ

పంట నమోదు జాబితాలు సిద్ధం చేయండి



ఆన్‌లైన్‌లో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: పంట నమోదు చేసుకున్న రైతుల తుది జాబితాను గ్రామాల వారీగా సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు ఏవోలను ఆదేశించారు. తప్పులుంటే బుధవారంలోగా సరిచేయాలని సూచించారు. ఎ.కొత్తపల్లి, వారాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరిలో పొడ, పాచి, అగ్గి తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వేరుసెనగ సాగులో జిప్సం వాడకంతో నూనె శాతం పెరుగుతుందన్నారు. ఏపీఎంఐపీ జిల్లా అధికారిణి లక్ష్మి, వ్యవసాయాధికారిణి కాంతమ్మ, విస్తరణాధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చీడికాడ: వరి సాగులో సస్యరక్షణ చర్యలతో మేలైన దిగుబడులు సాధించవచ్చనని వ్యవసాయాధికారిణి రమాదేవి సూచించారు. సిరిజాం, కోనాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణ, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కోనాం సర్పంచి ఈశ్వరమ్మ, వీహెచ్ఏలు కామేశ్, సుధీర్‌వర్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం గ్రామీణం: పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ నర్సీపట్నం సహాయ సంచాలకులు శ్రీదేవి రైతులకు సూచించారు. పెట్టుబడులు తగ్గించుకుని దిగుబడులు పెంచుకునే విధానాలను ఆచరించాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చెట్టుపల్లిలో రైతులతో సమావేశమయ్యారు. ఉద్యానాధికారి ప్రభాకరరావు, శాస్త్రవేత్త సత్తిబాబు, వ్యవసాయాధికారి అప్పారావు పాల్గొన్నారు.

గొలుగొండ: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని వ్యవసాయాధికారిణి సుధారాణి సూచించారు. చీడిగుమ్మలలో వరి పైరును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

ప్రత్యేక శిక్షణతో అభ్యసన సామర్థ్యాల వృద్ధి

రావికమతం, న్యూస్‌టుడే: నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ద్వారా అభ్యసన సామర్థ్యాలను వృద్ధి చేయవచ్చని ఎంఈవో బ్రహ్మాజీ సూచించారు. మేడివాడ జడ్పీ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

చీడికాడ: తురువోలులో చీడికాడ మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఎంఈఓ వెంకటరమణ, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు సరస్వతి, దేముడు, ప్రత్యేక ఉపాధ్యాయిని అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



మేడివాడలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
ప్లెక్స్-1
దేవర
ప్లెక్స్-2
విశ్వం

18న కొబ్బరి చిప్పలు, తల నీలాలకు వేలం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం లింగాలతిరుగుడు సోమలింగేశ్వర స్వామికి కార్తిక మాసంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 01 వరకు (29 రోజులు) భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు, తల నీలాలు పోగు చేసుకొనేందుకు ఈనెల 18న ఉదయం 11 గంటలకు వేలం వేయడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బి.మురళి తెలిపారు. ఇందుకు ఆసక్తి ఉన్నవారు కొబ్బరి చిప్పలకు రూ.5000, తల నీలాలకు రూ.1000 ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని వివరించారు. హెచ్చు పాట పాడుకున్నవారు పాడుకున్న పైకాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద కుళ్లిన చెత్త అధికంగా ఉంది. – నాయుడు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి కుళ్లు నియంత్రణకు చర్యలు తీసుకుంటాం – ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

ఎట్టకేలకు వెలిగిన వీధిదీపం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చిన ముషిడివాడ ఆర్వోబీ సమీపంలో పార్క్ వెనుక ప్రాంతంలో వీధి దీపం వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ప్రచురితమైన కథనానికి వార్డు ఏఈ శివరామ్ ప్రసాద్ స్పందించి తక్షణమే వీధి దీపానికి మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

నేడు పంచకర్ల పరవాడ సందర్శన

పరవాడ, న్యూస్‌టుడే: పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పరవాడ మండలంలోని పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లెవానిపాలెం, ఈ.బోనంగి, పి.బోనంగి పంచాయతీల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని కూటమి నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారన్నారు.

ఎటు చూసినా గుంతలు.. అంతులేని వెతలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 పరిధిలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు ప్రారంభమై ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ వెతలు వేధిస్తూనే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. యూజీడీ పనుల కారణంగా అంతులేని అవస్థలు మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ రోడ్లే పాడైపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే దినదిన గండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు



ప్రసాద్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా గోతులు

ఇక్కడ మరీ దారుణం..

జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీ ఆరు లేఅవుట్ల సమాహారం. ఇక్కడ భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నా అవస్థలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. భూమిలో గొట్టాలు అమర్చేందుకు పలుమార్లు రోడ్లు తవ్వేశారు. తిరిగి పూడ్చడంలో అలసత్వం వహించడంతో ఎక్కడ చూసినా గోతులే కనిపిస్తున్నాయి. అడుగు తీసి అడుగేయాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొంది.



పూర్తిగా ధ్వంసమైన ప్రసాద్‌నగర్ రహదారి

వర్షం కురిస్తే గండాలే..

వర్షాలు కురిస్తే శ్రమశక్తినగర్ వాసులకు గండాలు ఆహ్వానిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కాలనీలో అధికంగా వృద్ధులు నివాసముంటున్నారు. ఇక్కడ శివాలయానికి రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు గురవుతున్నారు. వర్షం కురిసిన రోజుల వరకు బురద, నీరు నిలిచిపోయి అవస్థలమయంగా మారుతోందని వాపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోతుల్లో నీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు బాగుచేయాలని వారంతా కోరుతున్నారు.



శ్రమశక్తినగర్‌లో ఓ కూడలి వద్ద ఇలా..

నిండిన నిర్లక్ష్యం



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న జలం



ప్రధాన రహదారిపైకి చేరిన నీరు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెంలోని రక్షిత మంచి నీటి ట్యాంకు నుంచి మంగళవారం పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పారింది. సాలిడ్ వేస్టు మెనేజ్‌మెంట్‌కు సమీపంలోని కొండపై ఉన్న ఈ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ట్యాంకు నిండి గంటల కొద్దీ నీరు బయటకి పోవడంతో పాటు కొండదిగువకు చేరి ప్రధాన రహదారి పైకి పారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జరుగుతోందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గల్లంతైన వృద్ధుడి మృతి

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీ పరిధిలోని దువ్వపాలెం చెరువులో సోమవారం సాయంత్రం గల్లంతైన వృద్ధుడు మంగళవారం శవమై తేలాడు. పెందుర్తి ఎస్ఐ అసిరి తాత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యర్ర సన్యాసిరావు (65) బహిర్భూమికి వెళ్లి చెరువులో జారి పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్, ఎస్ఐ అసిరితాత ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు అర్ధరాత్రి 1 గంట వరకు చెరువులో వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ క్రమంలో మంగళవారం వృద్ధుడి మృతదేహం చెరువులో తేలడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అసిరితాత తెలిపారు.

తీరానికి కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

పరవాడ: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరానికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని పురుష మృతదేహం కొట్టుకొచ్చింది. పరవాడ సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తీరానికి మృతదేహం కొట్టుకొచ్చిందని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో పాటు శరీరంపై ఎటువంటి దుస్తులు లేవు. సుమారు 20 నుంచి 30 రోజులు క్రితం మృతి చెంది ఉండొచ్చు. చేతులపై పచ్చబొట్టు గుర్తులు ఉన్నాయి. కుడి చేతిపై ఫ్లయింగ్ ఈగిల్ చిత్రం, 27, ఎస్, డబ్ల్యూ, ఎఫ్ ఆంగ్ల అక్షరాలు రాసి ఉన్నాయి. ఎడమచేతి వైపు 8.. కుడి చేతి చూపుడు వేలు వద్ద పీఆర్ అని ఆంగ్లంలో ఉంది. ఇతను తీరంలో మునిగిపోయి మృతి చెందాడా.. ఎక్కడి నుంచైనా మృతదేహం కొట్టుకొచ్చిందా అన్నది తెలియరాలేదు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో పోలీసులు భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

సుజాతనగర్ (పెందుర్తి): భారత మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని మంగళవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో విద్యార్థులు భారీ కలాం చిత్రాన్ని గీసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలో సినిమా చూడటానికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి రాతిచెరువు దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన **దాడి ప్రసాదరావు** (54) ఛత్తీస్‌గడ్‌లోని ఉక్కు పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటారు. సెలవుపై ఈ నెల 9న పెందుర్తి రాగా.. 12న మధ్యాహ్నం సినిమాకు పెందుర్తి థియోటర్‌కు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి చరవాణి కూడా పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ప్రసాదరావు భార్య హేమలత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కె.వి.సతీశ్‌కుమార్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజుకు అప్పగించారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: ఐదేళ్ల తరువాత గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి ఎమ్మెల్యే మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలి రోజు 28 పనులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి 1.69 కోట్లతో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. బంగారమ్మపాలెంలో 9 పనులకు గాను రూ.27.10 లక్షలతో.. ఆరిపాకలో రూ.17.90 లక్షలతో 3 పనులకు, నారపాడులో రూ.9.50 లక్షలతో 2 పనులు, గాలిభీమవరంలో రూ.28.60 లక్షలతో 6 పనులు, టెక్కలిపాలెంలో రూ.28.50 లక్షలతో ఒకపని, వంగలిలో రూ.21.90 లక్షలతో 3 పనులు, అంతకాపల్లిలూ రూ.36 లక్షలతో 4 అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా గ్రామాల్లో శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు దాడి లావణ్య, మామిడి శంకరరావు, గొంప సత్యవమ్మ, ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ సభ్యులు దాడి వెంకట సూర్య ఝాన్సీలక్ష్మీరాణి, సాలాపు మీన, ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దారు చిన్నికృష్ణ, పీఆర్ ఏఈ పి.హరిణి, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారమ్మపాలెంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులు భాగస్వాములు కావాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి సూచించారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇంఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి ఎంపీపీ నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, శిక్షకులు ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, హక్కులపై శిక్షణ ఇచ్చారు. గ్రామాభ్యున్నతిలో వారి పాత్రను వివరించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉప సర్పంచిలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు తమ విధులు, బాధ్యతలను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. సబ్బవరం మండలంలోని 24 పంచాయతీలకు చెందిన ఇద్దరేసి వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పంచాయతీ పాలనా పరమైన వ్యవహారాలు తెలుసుకోవాలన్నారు. ఎంఆర్‌పీలు కె.శివప్రసాద్, ఈవోఆర్డీ చైతన్య వారికి శిక్షణ ఇస్తూ సమావేశాలు నిర్వహించడం తప్పనిసరిగా చేయాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు ఎలా తయారు చేయాలి, వీధి దీపాల నిర్వహణ, లేఅవుట్ల ఎప్రూవ్ ఏ విధంగా చేయాలి అన్న అంశాల మీద అవగాహన కల్పించారు. సొంత నిధులు సమకూర్చుకోవడం, తాగునీరు తదితరాల గురించి వివరించారు.



ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు సూచనలిస్తున్న అధికారులు

అభివృద్ధికి బాటలు : ఎంపీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే తన ప్రథమ కర్తవ్యమని.. తద్వారా స్థానిక మహిళలకు, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గొట్టివాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కంకణం కట్టుకున్నారని తెలిపారు. కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీతో మాట్లాడి రూ.50 వేల కోట్ల రూపాయలు ఐదేళ్లలో తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఆ నిధులను ఉపయోగించి గ్రామాలకు అవసరమైనవి సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజలంతా క్షేమంగా ఉండాలన్న ఉద్దేశంతో ఎంత మందికైనా మినరల్ వాటర్ ప్లాంట్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గతంలో ఎద్దేవా చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కళ్లు తెరిచి పవన్‌కల్యాణ్ ఏ విధమైన అభివృద్ధి చేస్తున్నారో చూడాలన్నారు. అంతకుముందు పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 25 వేల కిలోమీటర్ల పొడవునా రోడ్లు వేయాలని నిర్ణయించామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు.

★ 1326 పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించిన సమావేశాల్లో తీర్మానాలు చేయించి వాటిని అమలు చేస్తున్న ఘనత పవన్ కల్యాణ్‌దేనన్నారు. ఒకేసారి పెందుర్తి నియోజకవర్గానికి రూ.25 కోట్లు ఇచ్చారన్నారు. ఇంకా ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచి సాలాపు మీన గొట్టివాడకు ఒక బస్ షెల్టర్ మంజూరు చేయాలని ఎంపీ సీఎం రమేశ్‌ను కోరారు. అనంతరం పలువురు కూటమి నేతలు సీఎం రమేష్, పంచకర్ల రమేష్, గండి బాబ్జీలను గజమాలతో సత్కరించారు. కూటమి నేతలు ఇందల వెంకట రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు సాలాపు వెంకటేశ్వరరావు, ఝాన్సీలక్ష్మీరాణి, శరగడం రామారావు, బంతికోళ్ల పద్మ, శరగడం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన కూటమి నేతలు, కార్యకర్తలు, గొట్టివాడ బీఎస్ కల్యాణ మండపంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

కేంద్ర బృందం.. పెందుర్తి యూపీహెచ్‌సీ సందర్శన

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ జైత్ర, రాష్ట్రీయ బాల సురక్ష పీవో డాక్టర్ సమత, ఎన్‌సీడీ కన్సల్టెంట్ మోహన్, తదితరులు ఆసుపత్రికి వచ్చారు. అక్కడ అందుతున్న సేవలను వైద్యాధికారిణి డాక్టర్ దీపికను అడిగి తెలుసుకున్నారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రి శిథిల భవనంలో కొనసాగడంపై స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



పెందుర్తి యూపీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం సభ్యులు

పరవాడ ఫార్మాసిటీలో విలువైన పల్లాడియం చోరీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మా సిటీలోని ఒక కంపెనీ నుంచి విలువైన లోహం పల్లాడియం చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫార్మా సంస్థలోని కెటలిస్టు (రసాయన చర్యను వేగవంతం చేయడానికి ఉత్ప్రేరకం)గా వినియోగిస్తారని తెలిసింది. గ్రాము విలువ వేలల్లో ఉంటుంది. ఆ కంపెనీని 40 రోజుల క్రితం నూతన యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే కంపెనీలో 4 కేజీల పెల్లాడియం చోరీకి గురైనట్లు గుర్తించిన యాజమాన్యం కొద్దిరోజుల క్రితం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే అక్కడికి చేరుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పలువురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీలోని కొందరు ఉద్యోగులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పెల్లాడియం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఒకటి, రెండు రోజుల్లో ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచుతున్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపులోకి తీసుకురావాలని సీపీఐ నేతలు మంగళవారం పెందుర్తి రైతుబజార్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఐ నాయకులు అత్తిలి విమల, ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ధరల నియంత్రణలో యంత్రాంగం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంబాబు, అన్నపూర్ణ, అసిరినాయుడు, రమణ, రామారావు, అరుణ, రజిని, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి రైతుబజార్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

పిల్లల్లో అభ్యసన వైకల్యాలను గుర్తించండి

పెందుర్తి, న్యూస్‌టుడే: పిల్లల్లో ఉన్న అభ్యసన వైకల్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలని సహిత విద్య ఉపాధ్యాయులు సూచించారు. డిస్‌లెక్సియా అవగాహన మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం పెందుర్తి దొగ్గవానిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలు పదాలను చదవడం, రాయడం, గుర్తించడంలో వెనుకబడి ఉండటాన్ని డిస్‌లెక్సియా అంటారని సహిత విద్య ఉపాధ్యాయుడు బీపీవీ.నాగేశ్వరరావు తెలిపారు. ఈ వైకల్యాన్ని గుర్తించి పిల్లలను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో దొగ్గవానిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెందుర్తి దొగ్గవానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

గెడ్డల్లో పూడికతీత పనులు



రవినగర్ గెడ్డలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు

నాయుడుతోట (వేపగుంట), న్యూస్‌టుడే: గెడ్డల్లో చెత్త వేసి వర్షపునీరు పారకుండా అడ్డంకులు సృష్టించవద్దని కాలనీవాసులకు కార్పొరేటరు బల్లశ్రీనువాసరావు సూచించారు. నాయుడుతోట దరి రవినగర్‌లో గెడ్డల్లో పేరుకుపోయిన పూడికలను మంగళవారం ఆయన ప్రజారోగ్యవిభాగం సిబ్బందితో తీయించి శుభ్రం చేయించారు. గెడ్డల్లో వ్యర్థాలు వేయకుండా ఇంటింటికి వచ్చే చెత్తబండికి ఇవ్వాలని కోరారు.

17 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సదస్సులు ఈనెల 17 నుంచి నవంబరు 11 వరకు జరుగుతాయని సబ్బవరం తహసీల్దారు బి.చిన్ని కృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలపై రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. రీసర్వేభూముల ఎక్కెట్లు, తేడాలు ఉన్న సరిహద్దు తేడాలు ఉన్నా, పేర్లు తప్పులుగా ఉన్న భూయజమానులు అర్జీలు పెట్టుకోవచ్చునన్నారు. గ్రామ సభలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

★ **షెడ్యూలు ఇలా :** 17న విప్పాక అగ్రహారం, 18 పైడివాడ, 19న అసకపల్లి, 21న ఎరుకునాయుడుపాలెం, 22న చింతగట్లఅగ్రహారం, 23న గొట్టివాడ, 24న గాలిభీమవరం, 25న లగిశెట్టిపాలెం, 26న రాయపుర అగ్రహారం, 28న బంగారమ్మపాలెం, 29న సబ్బవరం, నవంబరు 1న అయ్యన్నపాలెం, 2న బోదువలస, 5న ఎల్లుప్పి, 6న మొగలిపురం, 7న నారపాడు, 8న టెక్కలిపాలెం, 9న ఇరువాడ, 11న పైడివాడ అగ్రహారం గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆయన వివరించారు.

యువతను ప్రోత్సహించేందుకు 'నైపుణ్య పోటీలు'

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్: యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర మంత్రి జయంత్ చౌధరి పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, జాతీయస్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నైపుణ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వర్సిటీలో బోధనతోపాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వై.గౌతమ్‌రావు, వైద్య కళాశాల ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం అందించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధి దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతను పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాల ప్రాంగణంలో హైమాస్టు దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.